సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 21 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.38,300

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38,300, కనిష్టంగా రూ.14 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.16, సరాసరిన రూ.23 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం

31.3°/ 15.5°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఉల్లి విక్రయాలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రత్యేక కౌంటర్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉల్లి విక్రయాలు చేపట్టాలని, ఇందుకోసం కర్నూలు మార్కెట్ నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిత్యావసర వస్తువుల ధరల పర్యవేక్షణ, నియంత్రణపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా బియ్యం, కందిపప్పు, టమాట, ఉల్లి ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, నిత్యవసర వస్తువులు ధరలు అకస్మాత్తుగా పెరగకుండా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించే కార్యక్రమాలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టంగా అమలు చేయాలన్నారు. ధరలు పెరిగినప్పుడు ప్రత్యేక కౌంటర్ల ద్వారా నిత్యావసరాలు అందించేందుకు హోల్‌సేల్ వ్యాపారులు, దిగుమతిదారులు, మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలన్నారు. అలాగే జిల్లాలోని ప్రస్తుతం ఎన్ని వేరుశగన మిల్లులు పనిచేస్తున్నాయి...ఎన్ని మూతపడ్డాయి.. అందుకు గల కారణాలపై నివేదిక ఇవ్వాలని మార్కెటింగ్ శాఖ ఏడీని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, మార్కెటింగ్‌శాఖ అధికారి మూర్తి, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, తూనికలు, కొలతల శాఖ అధికారులు, మిల్లుల యజమానులు, ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఏపీఆర్‌జేసీ విద్యార్థుల సత్తా

- జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ జలజ, పీడీ శ్రీనివాసరెడ్డి

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. కళాశాలకు చెందిన పి.పునీత్‌కుమార్ (ఫస్ట్ ఇయర్) హ్యాండ్ బాల్ (అండర్–19), వి. గోపీచంద్ (సెకెండ్ ఇయర్) అథ్లెటిక్స్ (అండర్–19) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జలజ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులతో పాటు పీడీ శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జలజ మాట్లాడుతూ, ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొనగా. 30 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారిలో పునీత్‌కుమార్, గోపీచంద్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. వీరిరువురూ త్వరలో పంజాబ్‌లోని లూధియానా, జార్ఖండ్‌లోని రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

మనుషుల్నే మింగేస్తున్న పురుగు మందు



- మొదటికే మోసం తెస్తున్న పురుగు మందులు
- మనుషులపై తీవ్ర దుష్ప్రభావం
- తెల్ల, ఎర్ర రక్త కణాల ఆవిరి
- క్యాన్సర్, అల్సర్‌లకు దారితీస్తున్న వైనం
- ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నట్లు వైద్యుల హెచ్చరికలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పైర్లపై క్రిమి కీటకాలు దాడి చేస్తుంటే.. వాటిని చంపేందుకు వాడుతున్న పురుగు మందులు మనుషులపై దాడి చేస్తున్నాయి. ఏవైనా వ్యాధులు సోకినప్పుడు మనకు రక్షణ కవచంలా పనిచేసేది మూలకణాలే. ఎలాంటి రోగాలనైనా తిప్పికొట్టే సామర్థ్యం వీటికి ఉంటుంది. అలాంటి మూల కణాలపైనే పురుగు మందుల అవశేషాలు దాడి చేస్తున్నట్లు తేలింది. ఈ విషయం ప్రజలనే కాదు వైద్యులను కూడా తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటికే రకరకాల వైరస్‌లు, బాక్టీరియాలు దొంగ దెబ్బ తీస్తుండగా... నేడు పురుగు మందుల అవశేషాలు కూడా కోలుకోలేని దెబ్బతీస్తున్నట్లు వెల్లడి కావడం గమనార్హం. ఇకపోతే మందుల అవశేషాల వల్ల శరీరానికి ప్రాణవాయువులా ఉండే తెల్లరక్తకణాలు, ఎర్రరక్తకణాలు, ప్లేట్‌లెట్స్ కూడా ప్రమాదానికి గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. క్యాన్సర్ మొదలు ఎప్లాస్టిక్ ఎనీమియా (బోన్‌మారో ఫెయిల్యూర్ సిండ్రోమ్) వంటి తీవ్రమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నట్లు వివరిస్తున్నారు.

తీవ్ర నీరసం..

ఎప్లాస్టిక్ ఎనీమియా వల్ల శరీరంలో ప్రధానంగా హిమోగ్లోబిన్ శాతం పడిపోతుంది. తెల్లరక్త కణాలు గణనీయంగా తగ్గుతాయి. ఇక ప్లేట్‌లెట్స్ కౌంట్ వందల్లోకి చేరుతుంది. దీంతో మనిషి రోజు రోజుకు నీరస పడిపోతాడు. ఆరోగ్యవంతుడికి హిమోగ్లోబిన్ 14 ఉండాలి. కానీ ఎప్లాస్టిక్ ఎనీమియా బాధితుడికి 2 వరకు పడిపోతుంది. ప్లేట్‌లెట్స్ సాధారణంగా 1.50 లక్షల నుంచి 4 లక్షల పైన ఉండాలి. అలాంటిది వెయ్యికి కూడా పడిపోతాయి. దీనంతటికీ కారణం మూల కణాల్లోనుంచి ఉత్పత్తి కావాల్సిన తెల్లరక్త కణాలు, ఎర్రరక్త కణాలు, ప్లేట్‌లెట్స్ ఉత్పత్తి కాకపోవడమే. అంతేకాదు కొన్ని రకాల క్యాన్సర్‌లు, అల్సర్‌లు, చర్మానికి సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధులకు పురుగు మందుల అవశేషాలు కారణమని వైద్యులు చెబుతున్నారు.

విచ్చలవిడిగా వాడకం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూరగాయలతో పాటు పండ్ల తోటల వ్యవసాయం ఎక్కువగా ఉంది. పురుగు మందు పిచికారీ చేస్తేగానీ పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. ఈ క్రమంలో రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు వాడుతుండటంతో ఆ అవశేషాలు మనిషి శరీరంలోకి వెళ్లి తీవ్ర దుష్ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పురుగు మందుల అవశేషాల కారణంగా వస్తున్న జబ్బులను వైద్యులు వెల్లడిస్తున్నారు. దీర్ఘకాలిక జబ్బుల కారణంగా ఎక్కువమంది ప్రభావితమవుతున్నట్లు తేలింది. ముఖ్యంగా ఎప్లాస్టిక్ ఎనీమియా బారిన పడుతున్న వారు ఎక్కువవుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం

ఖరీఫ్	6.50 లక్షల హెక్టార్లు
రబీ	1.75 లక్షల హెక్టార్లు
ఉద్యాన పంటలు	5 లక్షల ఎకరాలు
ఏడాదికి పురుగు మందుల పిచికారీ	సుమారు 800 టన్నులు

అవగాహన లేకుండా వాడుతున్నారు

ఇటీవల కాలంలో చీడపీడలు, తెగుళ్ల నివారణకు కాంబినేషన్ విధానంలో మందులు పిచికారీ చేస్తున్నారు. ఒక మందు అవసరమైనా... అందులో మరొకటి లేదా రెండు రకాల మందులు కలిపి వాడుతున్నారు. సరైన అవగాహన లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. పురుగు, తెగుళ్ల ఉధృతిని అంచనా (ఎకనామిక్ త్రెషోల్డ్ లెవెల్) వేయకుండా లక్షణాలు కనిపించిన తక్షణమే పురుగు మందులు వాడుతున్నారు. కనీసం మూడేళ్లకు ఒకసారి లోతుగా దుక్కులు చేసుకుంటే కోశస్థ దశలో ఉన్న పురుగులు నశిస్తాయి. అలాగే ఒకే పంట కాకుండా మార్పిడి చేసుకోవాలి. పంట కాలంలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించినపుడు మందుల ఖర్చులు బాగా తగ్గిపోతాయి. వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తలు, పురుగు మందుల డీలర్లు సంయుక్తంగా రైతుల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ విజయశంకరబాబు, వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, రేకులకుంట.

జాగ్రత్తలు పాటించాలి

ప్రస్తుత రోజుల్లో రసాయనాలతో పండించిన పంటల వాడకం అధికమైంది. వీటివల్ల కిడ్నీ, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముంది. కేన్సర్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. పంటలకు క్రిమిసంహారక మందులు అధికంగా వాడడం వల్ల దీర్ఘకాలిక జబ్బుల బారిన పడే అవకాశాలూ ఉన్నాయి. వీలైనంత వరకు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఒకటికి రెండుసార్లు శుభ్రం చేసుకోవడం తదితర జాగ్రత్తలు పాటించాలి. ఆహారపు అలవాట్లు కూడా మార్చుకోవాలి.

– భీమాసేనాచార్, హెచ్‌ఓడీ, జనరల్ మెడిసిన్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

23న ప్రత్యేక సెలవు

పుట్టపర్తి: సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని పుట్టపర్తి నియోజకవర్గంలోని పాఠశాలలకు ఈ నెల 23వ తేదీన ప్రత్యేకంగా సెలవు ప్రకటించారు. ఈ మేరకు డీఈఓ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పుట్టపర్తి, బుక్కపట్నం, నల్లమాడ, కొత్తచెరువు మండలాల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు స్థానిక సెలవుగా ప్రకటించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

అనంతపురం: అదనపుకట్నం కోసం వేధించి భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. వివరాలు.. గుంతకల్లులోని అరవింద నగర్‌కు చెందిన బాలాజీనాయక్ కుమారుడు కే. సుబ్రమణ్యం నాయక్‌కు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం రాచువారిపల్లికి చెందిన అఖిలతో 2021లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో యువతి తల్లిదండ్రులు 10 తులాల బంగారు నగలు ఇచ్చారు. అయితే, ఆ తర్వాత కొన్నాళ్లకే అదనపు కట్నం కోసం భార్యను సుబ్రమణ్యం నాయక్ వేధించడం ప్రారంభించాడు. రూ.10 లక్షలు, ఒకటిన్నర ఎకర పొలం తన పేరు మీద రాయించాలని సతాయించేవాడు. మరోవైపు అఖిలపై అనుమానం పెంచుకుని హింసించేవాడు. ఈ క్రమంలోనే 2022 మార్చి 31 రాత్రి 8:30 గంటల సమయంలో అఖిల తన తల్లికి ఫోన్ చేసింది. 'నన్ను ఎక్కడెక్కడో తిప్పి ఇంటికి తీసుకొచ్చాడు. ఏం చేస్తాడో అనే భయం వేస్తోంది. రేపు ఉదయాన్నే ఊరికి వస్తా' అని చెప్పింది. అయితే, ఆ తర్వాతి రోజే సుబ్రమణ్యం నాయక్ అఖిలను గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు గుంతకల్లు సీఐ నాగశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతపురం నాలుగో సెషన్స్ జడ్జి కోర్టు(మహిళా న్యాయస్థానం)లో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో పీపీ సుజన 13 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో బుధవారం నాలుగో సెషన్స్ జడ్జి శోభారాణి తీర్పు వెలువరించారు. ముద్దాయి కే. సుబ్రమణ్యం నాయక్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధించారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి, ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేశ్, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ సా రెడ్డి, కానిస్టేబుల్ నాగేంద్రయ్యను ఉన్నతాధికారులు అభినందించారు.

ఆదిపత్యపోరుతో పల్లె పంచాయితీ

- 'కియా' వద్ద భారీగా భూములు కొన్న కూటమి నేతలు
- పంపకాల్లో తేడాతో ఏళ్లుగా నేతల మధ్య వివాదం
- 250 పైచిలుకు ఎకరాల్లో వాటాల్లో తేడా
- తాజాగా గోదాముకెళ్లే రోడ్డును జేసీబీతో ధ్వంసం చేసిన వైనం
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



రోడ్డు ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్)



తగాదాలో ఉన్న భూమి ఇదే

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి నేతల 'ఆది'పత్య పోరుతో 'పల్లె' పల్లెనా భూ వివాదాలు నెలకొన్నాయి. 'కియా' కార్ల కంపెనీ రాకను ముందుగానే పసిగట్టిన అప్పటి టీడీపీ నేతలు యర్రమంచి గ్రామ పరిసరాల్లో వందలాది ఎకరాల్లో భూములను తక్కువ ధరకే కొనుగోలు చేశారు. ఈ క్రమంలో అప్పడు మంత్రిగా ఉన్న టీడీపీ నేత బినామీల పేర్లతో వందల ఎకరాలు కొనుగోలు చేశారు. కానీ ఇప్పుడా భూములపైనే వివాదం నెలకొంది. అప్పట్లో సదరు మంత్రికి అత్యంత సన్నిహితుడుగా ఉన్న వ్యక్తితోనే ఇప్పుడు పంచాయితీ నడుస్తోంది.

మంత్రి సన్నిహితుడితో మాజీ మంత్రి పోరు..

యర్రమంచి వద్ద భూములు కొన్న మాజీ మంత్రి తాజాగా దౌర్జన్యానికి దిగడంతో వివాదం రేగింది. ప్రస్తుత మంత్రికి అత్యంత సన్నిహితంగా ఉన్న వ్యక్తితో సదరు మాజీ మంత్రి కయ్యానికి కాలు దువ్వడం ఆసక్తి రేపుతోంది. పంతం నెగ్గాలనే ఉద్దేశంతో ఎవరికి వారు లేఖలు రాసుకోవడం, లోలోపల పంచాయితీలు చేసుకోవడం ఏళ్లుగా సాగుతోంది. ఫలితంగా భూ వివాదం తెగకపోవడంతో మధ్యలో వెళ్లే రోడ్డును మాజీ మంత్రి ఇటీవల ధ్వంసం చేయించారు. జేసీబీలతో రోడ్డును తవ్వేయడంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. ఆ మార్గం గుండా 'కియా'కు అనుబంధంగా పనిచేసే ఓ కంపెనీ గోదాముకు వెళ్లాల్సి ఉండటంతో విషయం అమరావతి వరకూ చేరినట్లు తెలుస్తోంది. మరోవైపు మాజీమంత్రి దౌర్జన్యంపై బాధితులు జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా సదరు కంపెనీ యాజమాన్యం సీఎం చంద్రబాబుకు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు పంపించారు. అయితే కూటమి నేతల మధ్య పంతం ఏమాత్రమూ తగ్గలేదు.

వాటాల్లో తేడాతోనే..

'కియా' కార్ల కంపెనీ రాకతో అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఓ సీనియర్ నేత, మరో ముగ్గురు కలిసి సుమారు 250 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఆ సమయంలో ఎకరా సగటున రూ.20 లక్షల్లోపే ఉండేది. అందులో రోడ్డు పక్కనే ఉన్న భూమి, ఇతర భాగాలను పంచుకుని ఎవరికి వారుగా అగ్రిమెంట్లు చేసుకుని ఎకరా రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ ఎవరికి వారు విక్రయాలు చేశారు. అయితే రోడ్డుకు ఆనుకుని ఉన్న 70 ఎకరాలకుపైగా భూమి ఓ కూటమి నేత ఆధీనంలో ఉండటంతో మాజీ మంత్రి కన్నుపడింది. అందులోనూ తనకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. బేరం కుదరకపోవడంతో జేసీబీలతో దౌర్జన్యంగా రోడ్డు ధ్వంసం చేసినట్లు సమాచారం. అయితే సదరు వ్యక్తి జిల్లాకు చెందిన ప్రస్తుత మంత్రికి అత్యంత సన్నిహితంగా ఉండడంతో గట్టిగానే పోరాటం చేస్తున్నారు. ఇద్దరి మధ్య పంతంతో పక్కనే ఉన్న గోదాముకు వెళ్లేందుకు రోడ్డు లేకుండా పోయింది.

సీఎం వరకు పంచాయితీ..

వివాదం చెలరేగిన స్థలంలో నెలవారీ బాడుగ చెల్లిస్తూ 'కియా' అనుబంధ కంపెనీల గోదాములు ఏర్పాటు చేసుకున్నారు. అయితే కూటమి నేతల మధ్య భూ తగాదాలతో గోదాములకు వెళ్లే మార్గం లేకపోయింది. దీనిపై బాధితులు ఎస్పీ రత్నకు లేఖ రాశారు. అంతేకాకుండా సదరు కంపెనీ మేనేజర్ ద్వారా సీఎంఓ కు కూడా ఫిర్యాదు వెళ్లింది. నెల రోజుల నుంచి జిల్లా స్థాయిలో ఎన్ని పంచాయితీలు చేసినా సమస్య సద్దుమణగలేదు.

భూమి విలువ పెరగడంతో సమస్య..

కూటమి నేతలు కొన్న భూమిలో 170 ఎకరాలు చేతులు మారింది. మిగిలిన 80 ఎకరాల్లోనూ ఓ వ్యక్తి 20 ఎకరాలు విక్రయించాడు. ప్రస్తుతం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 50 ఎకరాలపై వివాదం నెలకొంది. అదంతా ఒకే వ్యకి ఆధీనంలో ఉండడంతో మిగతా వాటాదారులు తమకూ భాగం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి ఏకంగా రోడ్డును ధ్వంసం చేసి ఆ పొలంలోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే అప్పటికే అక్కడ 'కియా' విడిభాగాల కోసం గోదాములు ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కూటమి నేతల పెద్దల వద్ద పంచాయితీ జరుగుతున్నట్లు సమాచారం.

బాధ్యతలు చేపట్టిన బలరామిరెడ్డి



మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బలరామిరెడ్డి



బలరామిరెడ్డిని అభినందిస్తున్న నవీన్‌నిశ్చల్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ తదితరులు

- హిందూపురం మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా విధులు
- పట్టణాభివృద్ధికి అన్ని విధాలుగా కృషిచేస్తానని వెల్లడి

హిందూపురం: పట్టణ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి తెలిపారు. ఇటీవలే ప్రభుత్వం బలరామిరెడ్డిని మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషనర్ శ్రీనివాసులు బుధవారం ఇన్‌చార్జ్ చైర్మన్ బాధ్యతలను బలరామిరెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా బలరామిరెడ్డి మాట్లాడుతూ, కౌన్సిలర్లు, అధికారులను సమన్వయం చేసుకుంటూ పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. తాను కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, ఏదైనా సమస్య ఉంటే ప్రజలు నేరుగా తనను కలవవచ్చన్నారు. సమస్య పరిష్కారానికి శాయశక్తులా కృషిచేస్తానని వెల్లడించారు.

అభినందనలు తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు..

మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బలరామిరెడ్డిని ఆగ్రోస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా నేత నవీన్‌నిశ్చల్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు జయరాములు, రోషన్ అలీ, ఆయూబ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రొటోకాల్ పాటించని కమిషనర్..

నిబంధనల మేరకు బలరామిరెడ్డిని చైర్మన్ ఛాంబర్‌లో కూర్చోబెట్టి పదవీ బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. కానీ మున్సిపల్ కమిషనర్ ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించారు. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న బలరామిరెడ్డిని ఆయన ఛాంబర్‌లోనే కూర్చోబెట్టి ఇన్‌చార్జ్ చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కమిషనర్ అధికార పార్టీకి మద్దతు పలుకుతూ పాలకవర్గాన్ని లెక్కచేయడం లేదని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. కనీసం ప్రభుత్వ ఆదేశాలనైనా పాటించాలంటున్నారు.

అభాగ్యులకు అండగా నిలుస్తాం

- సత్యసాయి సేవా సంస్థల లక్ష్యమిదే
- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి



గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు



'కనెక్ట్ టూ కరెక్ట్' సాంస్కృతిక కార్యక్రమంలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: సమాజంలోని అభాగ్యులకు అండగా నిలుస్తూ, వారి అవసరాలు తీర్చడమే లక్ష్యంగా సత్యసాయి సేవా సంస్థలు పనిచేస్తున్నాయని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు తెలిపారు. సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాల్లో భాగంగా బుధవారం ప్రశాంతి నిలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. నేపాల్‌లోని నువాకోట్ జిల్లా ఖనిగౌన్ పర్వత ప్రాంతాల్లోని వారికోసం నేపాల్ సత్యసాయి సేవా సంస్థలు 8 కమ్యూనిటీ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులు నిర్మించాయి. ఈ ప్రాజెక్టులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమీష్ పాండ్య ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 2 వేల కుటుంబాలతో పాటు అక్కడి 11 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 4 వేల మంది విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించనున్నట్లు వారు వెల్లడించారు. ఇదే తరహాలో రూపొందించనున్న మరో కొత్త వాటర్ ప్రాజెక్ట్‌ను ఆర్‌జే రత్నాకర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సత్యసాయి సేవా సంస్థలు ఆయా ప్రాంతాల్లోని అభాగ్యులకు అండగా నిలుస్తూ నిస్వార్థ సేవలందిస్తున్నాయని కొనియాడారు.

వైభవంగా స్నాతకోత్సవం..

బాబా జయంత్యుత్సవాల సందర్భంగా బుధవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ శ్రీసత్యసాయి ఎడ్యుకేషన్ స్నాతకోత్సవం వైభవంగా జరిగింది. శ్రీసత్యసాయి యూత్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆర్‌జే రత్నాకర్ రాజు సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్–4 సభ్యులతో కలిసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న 'కనెక్ట్ టూ కరెక్ట్'

సత్యసాయి సేవా ఆర్గనైజేషన్‌కు చెందిన యూత్ సభ్యులు 'కనెక్ట్ టూ కరెక్ట్' పేరుతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. సత్యసాయి బోధనలను సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు చక్కగా వివరించారు. అనంతరం నిర్వహించిన ఫ్లూట్ కచేరీ పరవశభరితంగా సాగింది. పిల్లనగ్రోవిపై సత్యసాయిని కీర్తిస్తూ కళాకారులు చేసిన కచేరీ భక్తులను అమితంగా అలరించింది.

క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో పట్టపగలే చోరీ


ఆలయంలో చోరీకి పాల్పడుతున్న దృశ్యం (సీసీ కెమెరా ఫుటేజీ)

ఉరవకొండ: స్థానిక షిర్డి సాయిబాబా ఆలయంలో పట్టపగలే చోరీ జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... ఈ నెల 19న మాలాధారణ భక్తుడిగా ఆలయానికి వెళ్లిన ఓ దుండగుడు సాయిబాబా పంచలోహ విగ్రహంతో పాటు పెద్ద ఎత్తున వెండి సామగ్రి అపహరించుకెళ్లాడు. ఆ సమయంలో ఆలయంలో ఎవరూ లేకపోవడం గమనార్హం. మూలవిరాట్ వద్ద ఉంచిన బాబా పంచలోహ విగ్రహం, వెండి సామగ్రి, గంటను ఒక బ్యాగ్‌లో పెట్టుకొని తీసుకెళుతున్న దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. బుధవారం దుయం ఆలయంలో విలువైన వెండి సామగ్రితో పాటు స్వామి పంచలోహ విగ్రహం లేకపోవడంతో సీసీ కెమెరా ఫుటేజీలను ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు. దీంతో చోరీ విషయం వెలుగు చూసింది. ఘటనపై పోలీసులకు ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ప్రశాంతంగా మునిసిపల్ హెచ్‌ఎం పదోన్నతులు


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరపాలక సంస్థ, మునిసిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో మూడు గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు, ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీ స్కూళ్లలోని మూడు గ్రేడ్-హెచ్‌ఎం పోస్టులకు పదోన్నతులు జరిగాయి. డీఈఓ కార్యాలయంలో ఉదయం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి మధ్యాహ్నం కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా పోస్టులను భర్తీ చేశారు. 1:3 చొప్పున కౌన్సెలింగ్‌కు పిలవగా...అనంతపురం కార్పొరేషన్‌లో మొదటి అభ్యర్థి నాట్ విల్లింగ్ ఇచ్చారు. తక్కిన వరుసగా ముగ్గురూ పదోన్నతులు తీసుకున్నారు. అదే మునిసిపాలిటీలకు వచ్చేసరికి మూడు పోస్టులకు 9 మంది అభ్యర్థులను పిలవగా ఇద్దరు విల్లింగ్ ఇచ్చి..తక్కిన ఏడు మంది నాట్ విల్లింగ్ ఇచ్చారు. దీంతో సీనియార్టీ జాబితాలో 13వ స్థానంలో ఉన్న టీచరు ఫోన్ ద్వారా విల్లింగ్ ఇవ్వడంతో ఆయనను గురువారం కార్యాలయానికి రావాలని సమాచారం ఇచ్చారు.

సర్కారు నిర్ణయం... విద్యాభివృద్ధికి ఆటంకం

- ఉన్నత పాఠశాలల సమయం మరో గంట పెంపు
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో 32 పాఠశాలల ఎంపిక
- గ్రామీణ విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకం
- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



కదిరి: విద్యాభివృద్ధికి ఆటంకం కలిగేలా అశాస్త్రీయ నిర్ణయాలతో కూటమి సర్కార్ ముందుకు సాగుతోంది. ప్రభుత్వ ఆధీనంలోని అన్ని ఉన్నత పాఠశాలల సమయాన్ని పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఈ నెల 25 నుంచి అమలు..

ప్రస్తుతం ఉన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతున్నాయి. ఇకపై ఉదయం నుంచి 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల పనివేళల్లో మార్పు చేస్తూ పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో అమలు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాకు సంబంధించి మండలానికి ఓ పాఠశాల చొప్పున మొత్తం 32 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో 27 జెడ్పీ, 3 ప్రభుత్వ, మరో 2 మున్సిపల్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకూ కొత్త టైం టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. పైలెట్ ప్రాజెక్టు ముగియగానే తర్వాత రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో అమలు చేయనున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో సైతం ఉదయం 9 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకూ కాకుండా సాయంత్రం 4.30 గంటల వరకూ నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పెనుభారం..

పాఠశాలల పని వేళలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గ్రామీణ ప్రాంత విద్యార్థుల భద్రతకు పెనుముప్పు వాటిల్లేలా ఉంది. చాలా పాఠశాలలకు 4 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సమయాన్ని బట్టి సాయంత్రం 4 గంటలకు బడి ముగించుకుని విద్యార్థులు ఇంటికి చేరుకునేలోపు ఎంత లేదన్నా.. చీకటి పడిపోతోంది. అలా కాకుండా పాఠశాలల సమయం పెంచడం ద్వారా సాయంత్రం 5 గంటలకు బడి నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఇళ్లకు చేరుకునేందుకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. అంతేకాక బాలికల భద్రతకు భరోసా లేకుండా పోతోంది.

జిల్లాలో అమలయ్యే పాఠశాలలు ఇవే..

తలుపుల, తనకల్లు, మడకశిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు అమడగూరు, అమరాపురం, బత్తలపల్లి, చిలమత్తూరు, గాండ్లపెంట, గుడిబండ, కనగానపల్లి, ముదిగుబ్బ, నల్లచెరువు, నల్లమాడ, ఎన్‌పీకుంట, ఓడీ చెరువు, పరిగి, రొద్దం, రొళ్ల, తాడిమర్రి మండల కేంద్రాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, సోమందేపల్లి మండలం చిలకూరులోని జెడ్పీహెచ్‌ఎస్, బుక్కపట్నంలోని జెడ్పీహెచ్‌ఎస్ (బాయ్స్), సీకే పల్లి మండలం కనుముక్కలలోని జెడ్పీహెచ్‌ఎస్, అగళి మండలం మధుడిలోని జెడ్పీహెచ్‌ఎస్, ధర్మవరంలోని బీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్, గోరంట్లలోని జెడ్పీహెచ్‌ఎస్(బాయ్స్), హిందూపురంలోని అజీజియా మున్సిపల్ ఉర్దూ హైస్కూల్, కదిరిలోని జెడ్పీహెచ్‌ఎస్ (గరల్స్), లేపాక్షిలోని ఎస్‌ఎస్ఆర్ జెడ్పీ ఓరియంటల్ హైస్కూల్, పెనుకొండలోని తోటగేరి జెడ్పీహెచ్‌ఎస్, పుట్టపర్తిలోని బీడుపల్లి జెడ్పీహెచ్‌ఎస్, రామగిరి మండలం కుంటిమద్దిలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలు ఉన్నాయి.

సరైంది కాదు



ఉన్నత పాఠశాలల పని వేళలు మరో గంట పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకిచ్చిన హామీలను నెరవేర్చాలని కోరితే ఇలా పని గంటలు పెంచి ఉపాధ్యాయులను మానసికంగా వేధించాలనే అత్యుత్సాహం తప్ప బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలనే ఆలోచన లేదు. ఇది ఉపాధ్యాయుల కన్నా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చాలా ఇబ్బందికరం.

– డా.పీవీ రమణారెడ్డి, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు

ఉపసంహరించుకోవాలి



సాయంత్రం 5 వరకూ బడి నిర్వహిస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంటికి చేరే సరికి చీకటి పడుతుంది. అమ్మాయిల భద్రత ఏమిటనేది అందరూ ఆలోచించాల్సిన అవసరముంది. పని వేళల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలి. లేదంటే ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదు. ప్రభుత్వ నిర్ణయాన్ని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులూ వ్యతిరేకిస్తున్నారు.

–బడా హరిప్రసాద్‌రెడ్డి, ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు

ఉద్యమ బాట తప్పదు



ఉన్నత పాఠశాలల్లో పని వేళల పెంపు నిర్ణయం తీసుకునే ముందు ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. అలా కాకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని అన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన సమయపాలనే బాగుంది. దానినే కొనసాగిస్తే మంచిది. ప్రభుత్వ నిర్ణయంలో మార్పు రాకపోతే ఉద్యమ బాట తప్పదు.

– జి.హరిప్రసాద్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

మేం వ్యతిరేకిస్తున్నాం



సాయంత్రం 5 గంటల వరకూ బడి నడపాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని పూర్తి అశాస్త్రీయం. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోక పోతే కూటమి సర్కారు ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదు. భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవడం ఖాయం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలా లేదు.

– కాడిశెట్టి శ్రీనివాసులు, ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు వీడాలి

- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ



మాట్లాడుతున్న 'ఆపస్' రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

అనంతపురం ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం, మరింత ఒత్తిడికి గురిచేసే విధానాలను ఇప్పటికైనా మానుకోవాలని కూటమి సర్కార్‌ను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఆపస్ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యవర్గాల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాలాజీ మాట్లాడుతూ... ఇప్పటికే రకరకాల యాప్‌లు, ఎఫ్‌ఎల్‌ఎన్ మరియు లీడర్‌షిప్ ట్రైనింగ్‌లు, అపార్ నంబర్ జనరేషన్ తదితర బోధనేతర పనులతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. 117 జీఓతో ఉపాధ్యాయులపై విపరీతమైన పని భారం ఉందన్నారు. దీనికి అదనంగా సాయంత్రం 5 గంటల వరకు బడి వేళలు పొడిగించడం దారుణమన్నారు. ప్రస్తుతం ఉన్న బడివేళలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చాలా అనుకూలంగా ఉన్నాయన్నారు. అదే సమయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆపస్ రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలన్నారు. అప్పటి దాకా మధ్యంతర భృతి (ఐఆర్)ను ప్రకటించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి మాట్లాడుతూ... 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు జీఓ 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన అధ్యాపకుడు డాక్టర్ రంగనాథంను సన్మానించారు. సమావేశంలో సంఘం గౌరవ సలహాదారుడు వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణ స్వామి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, నాయకులు హర్షవర్ధన్, పీఎస్‌వీ నాయుడు, గోపీచంద్, భాస్కరయ్య, రమేష్ వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీ నేత బరి తెగింపు

- స్థలాన్ని ఆక్రమించుకునే పన్నాగం
- మహిళలపై దురుసు ప్రవర్తన


మహిళలపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నేత

అనంతపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు బరితెగించారు. ప్రభుత్వ భూములే కాకుండా సామాన్యులు కష్టపడి కొనుకున్న స్థలాలను సైతం ఆక్రమించుకోవడానికి పన్నాగం పన్నారు. బుధవారం రుద్రంపేటలో ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. ఏళ్ల నాటి క్రితం కొనుగోలు చేసిన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు హిందూపురం మాజీ కార్పొరేటర్ చక్రపాణినాయుడు తమపై దౌర్జన్యం చేస్తున్నారని బి.యాలేరు గ్రామానికి చెందిన మనేరు ఈశ్వరయ్య కుటుంబసభ్యులు బుధవారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు మాట్లాడుతూ... కక్కలపల్లి సర్వే నంబర్ 133-1, 134లో 4 సెంట్ల స్థలాన్ని 1991లో కొనుగోలు చేసి తమ తల్లి మనేరు నరసమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి, చుట్టూ ఫెన్సింగ్ వేయించామన్నారు. ఆ స్థలాన్ని తాము ఎవరికి విక్రయించలేదన్నారు. ఆ స్థలానికి చక్రపాణినాయుడుకు ఎలాంటి సంబంధం లేకపోయినా ఆక్రమించుకునేందుకు తమపై దౌర్జన్యానికి తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలాన్ని ఆక్రమించుకుంటే దిక్కేవరు వస్తారని, తనకు పరిటాల శ్రీరామ్, బాలకృష్ణ బంధువులవుతారంటూ స్థలం చుట్టూ నాటిన బండలను జేసీబీతో పగులకొట్టించారని వాపోయారు. ఆ సమయంలో అడ్డుకోబోయిన మహిళలపై తన అనుచరులతో కలసి దురుసుగా ప్రవర్తించారన్నారు. పోలీసు అధికారులు స్పందించి టీడీపీ నాయకుల అరాచకాల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

జనవరి 3 నుంచి ఎస్‌ఎస్‌బీఎన్ 80వ వార్షికోత్సవం


మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు పరుచూరి రమేష్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సాయిబాబా జాతీయ పాఠశాల, కళాశాలల 80వ వార్షికోత్సవాన్ని 2025, జనవరి 3 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేలా ఏర్పాట్లకు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు బుధవారం ఆ కళాశాలలో సమావేశమై చర్చించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పరుచూరి రమేష్ బాబు మాట్లాడుతూ 1945లో సత్యసాయి బాబా జాతీయ ఉన్నత పాఠశాలను స్థాపించారని గుర్తు చేశారు. కాలక్రమేణ జూనియర్ కళాశాలగా, డిగ్రీ, పీజీ కళాశాలగా వృద్ధి చెందడం సంతోషదాయకమన్నారు. ఈ విద్యాసంస్థలో చదువుకున్న ఎంతోమంది కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలుగా స్థిరపడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ పూర్వ విద్యార్థులతో పాటు పూర్వ ఆచార్యులతో కలసి 80 వసంతోత్సవాల పేరిట ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 3న పాఠశాల వేడుకలు, 4న జూనియర్ కళాశాల వేడుకలు, 5న డిగ్రీ, పీజీ కళాశాలల ఆత్మీయ సమ్మేళన వేడుకలు ఉంటాయన్నారు. ఈ విద్యాసంస్థలో చదువుకున్న ప్రతి విద్యార్థీ వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు పీఎల్‌ఎన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్ఆర్ నాగభూషణం, కార్యదర్శి సుంకు వేణుగోపాల్, సహాయ కార్యదర్శులు శివచంద్ర, అన్నపూర్ణ, కోశాధికారి చంద్రశేఖర్ గుప్త పాల్గొన్నారు.

ఊరంతా నీరే!


సాతార్లపల్లిలో పాచి పట్టిన రోడ్డు


వీధిలో ప్రవహిస్తున్న నీరు

- ఇబ్బందుల్లో గ్రామస్తులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని సాతార్లపల్లి గ్రామంలో దాదాపు 30 రోజులుగా మరువ నీరు ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి ఉపరితలంలో గోబరకుంట చెరువు ఉంది. దానికి పైభాగంలో ఉన్న కొండల నుంచి నీళ్లు సమృద్ధిగా వస్తుండడంతో రోజూ మరువ పారుతోంది. ఈ మరువ నీళ్లన్నీ గ్రామంలోకి చేరుకుంటున్నట్లుగా గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏటా నాలుగైదు నెలల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వివరిస్తున్నారు. ఫలితంగా గ్రామంలోని రెండు వీధులు పూర్తిగా పాచిపట్టి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. దీనికి తోడు మరుగుదొడ్ల గుంతలు, తాగునీటి సంప్‌లు పూర్తిగా మురుగు నీటితో నిండుతుంటాయి. గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో సమస్య మొరపెట్టుకున్నా నేటికీ పరిష్కారం దక్కలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండల మధ్య గ్రామం

పుట్టపర్తి మండల కేంద్రానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో పూర్తి కొండల మధ్య సాతార్లపల్లిలో దాదాపు 180 కుటుంబాలు, 600కు పైగా జనాభా ఉంది. గ్రామంలోకి తరచూ అడవి జంతువులు వస్తూ పోతుంటాయి. గత ప్రభుత్వంలో తారు రోడ్డు వేయడంతో మండల, జిల్లా కేంద్రానికి రాకపోకలు పెరిగాయి. అయినా గ్రామానికి ఆటోలు, బస్సులు వెళ్లవు. ద్విచక్ర వాహనాలే గతి. ఇక వర్షాకాలం మొత్తం ఆరు నెలల పాటు ఊట నీటితో ఇబ్బంది పడుతుంటారు. ఎటు చూసిన మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతూ ఉంటుంది. దీనిపై సచివాలయ కార్యదర్శి ఓంప్రసాద్, ఉపాధి ఏపీఓ మధుసూదన్‌రెడ్డి తదితర అధికారులను వివరణ కోరగా... సమస్యకు పరిష్కారం తమ శాఖల పరిధిలో లేదన్నారు. ఒక వేళ పనులు చేపట్టినా ఇందుకు తగినన్ని నిధులు మంజూరు కావన్నారు.

ప్రయాణికుడికి సొత్తు అప్పగింత


ప్రయాణికునికి వస్తువులు అందజేస్తున్న డిపో మేనేజర్ ఇనయతుల్లా, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: బస్సులో మరిచిపోయిన బ్యాగ్, అందులోని 40 గ్రాముల బంగారు నగలు, ఇతర వస్తువులను సంబంధిత ప్రయాణికుడికి డ్రైవర్లు ఎస్‌వీ నారాయణ, డీసీ శేఖర్ అందజేసి, తమ నిజాయితీని నిరూపించుకున్నారు. వివరాలు... ఈ నెల 18న రాత్రి నెల్లూరు నుంచి పుట్టపర్తికి బయలుదేరిన ఆర్టీసీ బస్సులో నెల్లూరు జిల్లా వాకాడ మండలం కొండూరుపాలెం గ్రామానికి చెందిన సోమయ్య ప్రయాణిస్తూ తన స్టేజ్ రాగానే రెండు బ్యాగ్‌లు మరిచి దిగిపోయాడు. 19వ తేదీ ఉదయం పుట్టపర్తి డిపోకు చేరుకున్న బస్సులో రెండు బ్యాగ్‌లను గుర్తించిన డ్రైవర్లు ఎస్‌వీ నారాయణ, డీసీ శేఖర్ వెంటనే వాటిని డిపో క్లర్క్‌కు అందజేశారు. విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ ఇనాయతుల్లా బ్యాగ్ తెరిచి చూసి అందులోని బ్యాంక్ పాస్‌బుక్కులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా ప్రయాణికుడితో మాట్లాడారు. బుధవారం ఉదయం పుట్టపర్తి డిపోకు చేరుకున్న సోమయ్య తన ఆధారాలను చూపి బ్యాగ్‌లతో పాటు సొత్తును స్వాధీనం చేసుకున్నాడు. నిజాయితీ చాటుకున్న డ్రైవర్లు ఎస్‌వీ నారాయణ, డీసీ శేఖర్‌ను డీఎం ఇనాయతుల్లా, యూనియన్ నాయకులు, సిబ్బంది అభినందించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



గుత్తి: రైలు నుంచి జారి పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుత్తి ఆర్‌ఎస్‌లోని పత్తికొండ మార్గంలోని ఆర్‌ఓబీ సమీపంలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. సంఘటనా స్థలాన్ని జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప మాట్లాడుతూ... మృతుని వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఇతర ఆధారాలేమీ లభ్యం కాలేదని, ఆచూకీ పసిగట్టిన వారు సమాచారం ఇవ్వాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య


ఆదినారాయణ (ఫైల్)

పరిగి: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లికి చెందిన ఆదినారాయణ(44)కు భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. మగ్గం వార్పు పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో ఇద్దరి కుమార్తెల పెళ్లిలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. అప్పులకు వడ్డీల భారం పెరిగి తీర్చలేని స్థాయికి చేరుకోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన ఆదినారాయణ... మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమార్తె ఇంటి నుంచి బుధవారం ఉదయం తిరిగి వచ్చిన ఈశ్వరమ్మ... ఉరికి విగతజీవిగా వేలాడుతున్న భర్తను చూసి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతి లెటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 26వ తేదీ వరకూ గడువు పొడిగించారు. ఈ మేరకు లేపాక్షిలోని విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉచిత ప్రవేశ పరీక్ష 2025, ఫిబ్రవరి 8న ఉంటుంది.

ప్రమాదంలో వ్యక్తి మృతి

లేపాక్షి: మండలంలోని గొంగటిపల్లి వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు... చిలమత్తూరు మండలం వీరాపురం గ్రామానికి చెందిన ఈడిగ నారాయణప్ప (60) ద్విచక్రవాహనంపై బుధవారం హిందూపురానికి వెళ్లి సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాడు. గొంగటిపల్లి వద్దకు చేరుకోగానే వాహనం చైన్ తెగిపోవడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు వెంటనే హిందూపురంలోని ఆస్పత్రికి తరలించి, వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.

ఆర్‌ఆర్‌బీ పరీక్షార్థుల కోసం ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ఈ నెల 23, 24వ తేదీల్లో ఆర్‌ఆర్‌బీ పరీక్షలు రాసే అభ్యర్థుల రాకపోకలకు అనుకూలంగా అనంతపురం జిల్లా మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు బుధవారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించాయి. 23న నాంథేడ్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం 12.25 గంటలకు బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలు(07105) మరుసటి రోజు ఉదయం 6.25 గంటలకు తిరుపతికి చేరుతుంది. తిరిగి ఈ రైలు తిరుపతి జంక్షన్ నుంచి 24వ తేదీ మధ్యాహ్నం 3.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35 గంటలకు నాంథేడ్ జంక్షన్‌కు చేరుతుంది. ఈ రైళ్లు ముద్కెడ్, ధర్మాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూలు, డోన్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.